ఓం వేదాంతభేరి ఓం

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 52 జనవరి 2019 సంచిక : 01

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు, ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1500/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు, విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

ఓం వేదాంతభేరి ఓం

అనుష్ఠాన వేదాన్తాన్ని బోధించు మాసపత్రిక

సంపుటము : 52 జనవరి 2019 సంచిక : 01

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. ఉపనిషత్సందేశము -శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. సద్గురూపదేశాలు - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 08
04. సంక్రాన్తి - శ్రీ విద్యాస్వరూపానన్దగిరి స్వాములవారు -09
05. ధర్మ స్వరూపమ్ - శ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు - 11
06. ఆత్మహత్యాయత్నం - ఆకాశవాణి - డా॥ సముద్రాల లక్ష్మణయ్య -14
07. ఆంజనేయస్వామికి ఆకుపూజ- డా॥ ఆచార్య కె.సర్వోత్తమరావు -17
08. ఉద్ధవగీత -భిన్నంగా కనిపిస్తున్న ఏకత్వం- వై.హెచ్.రామకృష్ణ - 19
09. జీవుడా! మేలుకో!!- శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 25
10. శ్రీ మదాంధ్ర మహాభాగవతం-ఆచార్య జక్కంపూడి మునిరత్నం - 27
11. ఆండాళ్ - అనన్యభక్తి - సంకీర్తనా ఫలం- డా॥కె.బి.రాజేంద్రప్రసాద్ - 31
12. ఆధ్యాత్మిక సాధకులకు సదవకాశము - 38
13. నమస్కారం - కె. ఈశ్వర్ - 39
14. ఉపదేశ సారము - భగవాన్ శ్రీ రమణమహర్షి - 41
15. వార్తలు - 42

ముఖచిత్రం - భగవాన్ రమణ మహర్షి

జనవరి 1వ తేది మంగళవారం ఆంగ్ల సంవత్సరాది

జనవరి 5 వ తేది శనివారం భగవాన్ రమణమహర్షి జయన్తి

జనవరి 15వ తేది మంగళవారం మకరసంక్రాన్తి-ఉత్తరాయణ ప్రారంభం

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

- శివప్రోక్తం సూర్యాష్టకమ్

01. ఓం ఆదిదేవ! నమస్తుభ్యం ప్రసీద మమ భాస్కర
దివాకర! నమస్తుభ్యం ప్రభాకర నమోఽస్తు తే ॥

02. ఓం సప్తాశ్వరథమారూఢం ప్రచణ్డం కశ్యపాత్మజమ్ ।
శ్వేతపద్మధరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్ ॥

03. ఓం లోహితం రథమారూఢం సర్వలోకపితామహమ్ ।
మహాపాపహరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్ ॥

04. ఓం త్రైగుణ్యం చ మహాశూరం బ్రహ్మవిష్ణుమహేశ్వరమ్ ।
మహాపాపహరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్॥

05. ఓం బృంహితం తేజసాం పుంజం వాయురాకాశమేవ చ ।
ప్రభుస్త్వం సర్వలోకానాం తం సూర్యం ప్రణమామ్యహమ్॥

06. ఓం బన్ధూకపుష్ప సంకాశం హారకుణ్డల భూషితమ్ ।
ఏకచక్రధరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్ ॥

07. ఓం విశ్వేశం విశ్వకర్తారం మహాతేజః ప్రదీపనమ్ ।
మహాపాపహరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్॥

08. ఓం శ్రీ విష్ణుం జగతాంనాథం జ్ఞానవిజ్ఞానమోక్షదమ్ ।
మహాపాపహరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్॥

09. ఓం సూర్యాష్టకం పఠేన్నిత్యం గ్రహపీడా ప్రణాశినమ్ ।
అపుత్రో లభతే పుత్రం దరిద్రో ధనవాన్భవేత్ ॥

వేదాన్తభేరి పాఠకులకు,రచయితలకు,
పోషకులకు, ప్రపంచంలోని చరాచర ప్రాణులకు
సంక్రాన్తి శుభాకాంక్షలు.



ఉపనిషత్సందేశము

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

ఉపనిషత్తులు జనుల కేమి బోధించుచున్నవి? అవి ప్రజానీకమున కొసంగు సందేశమేమి? ఒక్క వాక్యములో ఆ సందేశమంతయు ఇముడ్చవచ్చును. అదియే 'తత్త్వమసి'. ఇది వాక్యము కాదు మహావాక్యము. బోధ కాదు ప్రబోధము. 'ఆ పరమాత్మయే నీవు ' అని ఉపనిషత్తులు శాసించుచున్నవి. ఎంతటి ఆహ్లాదకరమైన వాక్యమది! ఎంతటి ధైర్యోద్బోధకమగు సందేశమది! ఆ ఒక్క వాక్యమును అనుభూత మొనర్చుకొనినచో, ఇక జన్మజన్మాంతరము జీవుని పట్టి పీడించుచున్న అవిద్యా పిశాచము ఒక్క క్షణకాలములో పలాయన మంత్రమును పఠింపవలసినదే. 'భిద్యతే హృదయగ్రన్థి' అనునట్లు ఆ సమయమున, అనగా జీవుడు 'తత్త్వమసి' మహావాక్యమును జీర్ణముచేసికొని, 'అహం బ్రహ్మాస్మి' అను అనుభూతిని బడసినపుడు సమస్త భవబంధములు తొలగిపోవును. హృదయ గ్రంథులన్నియు విచ్ఛిన్నములగును. ఇక మనుజుడు తన జీవిత చరమలక్ష్యమును సాధించినట్లే. అట్టి మంగళమయ దశను శీఘ్రాతిశీఘ్రముగ అనుభవించి కృతార్థులు కండని ఉపనిషత్తులు ఉద్ఘోషించుచున్నవి.

అయితే బహుజన్మాభ్యస్త దృశ్యసంస్కారమువలన మనుజుడు తాను దేహమని, తాను అల్పుడని, తాను బద్ధుడని తలంచుచున్నాడు. ఇట్టి దేహతాదాత్మ్యమువలన ఉపాధిజనిత దుఃఖములన్నిటిని తనపై ఆరోపించుకొని నానా అవస్థలు పడుచున్నాడు. మనుజుని దుఃఖమున కంతకును కారణ మీ అజ్ఞానజనిత దేహతాదాత్మ్యమే అయియున్నది. కావున జీవునకు దుఃఖము సమూలముగ తొలగిపోయి శాశ్వతానందము కలుగవలెనినన, తనయొక్క వాస్తవ చిన్మయ స్వరూపమును

స్మృతిపథమునకు తెచ్చుకొనవలెను. ఉపనిషత్తులు చేయు మహోపకారమిదియే. అవి జీవునకు తన సహజ స్వరూపమును జ్ఞాపకము చేయుచున్నవి. తలుపు తట్టి 'నీవు పరబ్రహ్మస్వరూపుడవ'ని చెప్పుచున్నవి. మేలుకొలిపి మరల తమస్సునందు పడవద్దని హెచ్చరించుచున్నవి. 'ఓ జీవుడా! నీవు ఏడు జానల మనిషివి కావు, భూనభోంతరాళములు పరివేష్టించిన విశ్వవ్యాపక దీర్ఘ దేహుండవు. నీవు ప్రకృతి రథచక్రములక్రింద నలిగిచచ్చు అల్పకీటకము కావు, ప్రకృతిని శాసించు పరమాత్మవు. నీవు బద్ధుడవు కావు. ముక్తుడవు. కర్మాధీనుడవు కావు. కర్మాతీతుడవు. మృత్యురూపుడవు. కావు, అమరుడవు. భృత్యుడవు కావు. రాజాధి రాజువు. పాదుషాచక్రవర్తివి. వెయ్యేల నీవు జీవుడవు కావు, సాక్షాత్ శివుడవే.

ఇదియే ఉపనిషత్తులయొక్క సందేశము. శ్రుతి భగవతి యొక్క ఈ సద్బోధను, ఈ హెచ్చరికను పాటించిన వారి యొక్క జన్మము ధన్యమైనట్లే. వేదమాత యొక్క ఈ వాత్సల్యప్రపూరిత వచనముల నాలకించిన వారియొక్క శోకమోహములు పటాపంచలైనట్లే. దీనిచే వారికి కలుగు ధైర్యము అపారము. ఇట్టి వాక్యములను మననము చేయుట వలన మనుజుని హృదయములో గొప్ప ఉత్తేజము జనించుచున్నది.

It is strength and strength that we want, and the first step in getting the strength is to uphold the Upanishads and believe that I am the Atman.

అని స్వామి వివేకానందులు ప్రవచించినట్లు మనుజునకు పారమార్థిక, వ్యావహారిక బలములు రెండును కూడ ఉపనిషత్తులను, సచ్ఛాస్త్రములను విశ్వసించి, తాను దేహము కాదు ఆత్మయే యని మననము చేయుటవలననే లభించుచున్నవి. ఇది ముమ్మాటికిని సత్యము. కావున శోక మోహోపహతు లగు జీవులందఱును్ను ఈ వేదానుశాసనమును, ఈ ఉపనిషన్నిర్ఘోషను ఆలకించి, అనుష్ఠించి మహాబల సమన్వితులై, ఆత్మతేజోవిరాజితులై జన్మ సార్థకతను బడయుదురు గాక!

సద్గురూపదేశాలు

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

1. లౌకిక సుఖాన్ని ఎవడు తుచ్ఛంగా భావిస్తాడో, అట్టి బ్రహ్మనిష్ఠునికి జ్ఞానదృష్టి వికసించి తీరుతుంది. ఇందులో సందేహం లేదు.

2. ఉపనిషత్తులు, భగవద్గీత, భారతం, భాగవతం, రామాయణం మున్నగు ఉద్గ్రంథములు, శ్రీశంకరాచార్యాది మహనీయుల రచనలు, బోధలు తాను లెస్సగ పఠించి, వానిని జీవితమున కార్యాన్విత మొనర్చి ఇతరులకు కూడా వానిని అందజేయవలెను.

3. లేని మహిమలు చెప్పుకొనినచో, ఉన్న మహిమలు ఊడిపోవుటే గాక రానున్నవి కూడా రాకపోవచ్చును.

4. మీరు ఇంద్రియములకున్ను, దాని కృత్యములు కున్ను సాక్షియై వెలిగెడు శుద్ధబోధ స్వరూపులు అను ఆత్మభావనచేత మీ మనస్సును ఊర్ధ్వముగా గొనిపోయి సువర్లోక, మహర్లోక, జనోలోక, తపోలోక, సత్యలోకములకు అవతల కందజేసి దైవసదృశులుగా చేయునని సత్యముగా నమ్ముడు.

5. పాపపరిహారం కొఱకు పంచశాస్త్రులునిర్దేశించబడ్డాయి. అవి 1. ఉపవాసం, 2. జపం, 3. మౌనం, 4. పశ్చాత్తాపం, 5. అన్న శాన్తి అనేవి. పాపం యొక్క హెచ్చుతగ్గుల ప్రమాణము ననుసరించి ప్రాయశ్చిత్త ప్రమాణం కూడా వుండును.

6. కరచరణాదులైన ఇన్ద్రియాలతో సదా సత్కర్మలు చేస్తూ, వాక్కుతో దైవాన్ని స్తుతిస్తూ, లేదా సత్యధర్మాల తత్త్వాన్ని బోధిస్తూ, మాలిన్యం అంటక సంయమనం కలిగియున్న హృదయంతో, పరోపకార పరాయణమైన స్వభావంతోను కూడినవాడై, నియతాత్ముడై, ఎవడు జీవితాంతం కాలం గడుపుతాడో అతడే జీవన్ముక్తుడు, మహాత్ముడు, బ్రహ్మజ్ఞాని, యోగి, పరమభక్తుడూ అవుతాడు.

7. వేసవిలో తీవ్రమైన ఎండకు లోకమంతా తపిస్తుంది. కాని ఎత్తైన కొండమీది ప్రదేశం చల్లగా వుంటుంది. ఆ మాదిరి అజ్ఞానదశలో ఈ జగత్తు దుఃఖతప్తమవుతుంది. అయినప్పటికీ ఆత్మయందే దృఢమైన స్థితిగలవారు ఆనందమయులై వుంటారు.

8. సోదరా ! మానవసేవ జేయుట మనుజునికి శ్రేష్ఠ ధర్మము. అయితే మానవసేవ చేయుటకు ముందుగా నీవు నీ మానససేవ చక్కగా చేయుము. అట్లయిన మాత్రమే నీవు మానవసేవను సరిగా చేయగలవు.

9. మనస్సు చేయు చేష్టలను ఏకాంతముగ కూర్చుండి జాగ్రత్తతో నిరీక్షించుచుండిన మనోజయము త్వరలో సిద్ధించును.

సంక్రాన్తి

– శ్రీ విద్యాస్వరూపానన్దగిరి స్వాములవారు

"రవేః సంక్రమణం రాశౌ సంక్రాన్తిరితి కథ్యతే " – "సూర్యుడు ఒక రాశి నుండి మరో రాశిలోనికి ప్రవేశించే సమయాన్ని సంక్రాన్తి అంటారు" అని స్కంద పురాణం నాగరఖండంలో చెప్పబడింది. ఈ ప్రకారం మనకు సంత్సరానికి పన్నెండు సంక్రాన్తులు. అయితే ఈ పన్నెండు సంక్రాన్తులలో అందరూ పండుగగా కొలిచేది మకర సంక్రాన్తినే. ఇది మార్గశిరంలో గాని, పుష్యమాసంలో గాని వస్తుంది. ఈ సంక్రాన్తి నుండి ఉత్తరాయణం ప్రారంభమవడం చేత ఈ మకరసంక్రాన్తికి ఇంత ప్రాముఖ్యత కలిగింది.

ఈ శ్రీవిళంబినామ సంవత్సరంలో పుష్యమాసంలో 14.1.2019 తేది రాత్రి గం 1-11 నిమిషాలకు రవి మకరరాశిలో ప్రవేశిస్తాడు అని కొన్ని పంచాంగాలు, మరికొన్ని 14-1-2019 తేది రాత్రి గం 7-51 నిమిషాలకు రవి మకరరాశిలో ప్రవేశిస్తాడని వ్రాశారు. ఎట్లయితేనేమి ఈ సంక్రమణ రాత్రిపూట జరుగుతూంది కాబట్టి "సూర్యాస్తమయ కాలానంతరే ప్రవేశాత్పరదినే మకరసంక్రమణ ప్రయుక్త ఉత్తరాయణ పుణ్య కాలః భవతి" అని వున్నందున 15-01-2019 తేది ఈ సంవత్సరం మనకు సంక్రమణ పుణ్యకాలము. కాబట్టి సంక్రాన్తి పండుగను 15-01-2019 తేది జరుపుకోవాలి.

సంక్రాన్తులను గురించి ముక్తసంగ్రహంలో – "మకర సంక్రాన్తీ క్రమేణ ఉత్తరాయణం దక్షిణాయనం స్యాత్" అని చెప్పబడినట్లు మకర సంక్రాన్తి మొదలు ఆరు సంక్రాన్తులు ఉత్తరాయణము. ఈ ఉత్తరాయణ ప్రారంభం మకర సంక్రాన్తి నాడు రావడం వలన దీనికి మరింత మహత్వం గల్గింది. అందుచేత ఈ మకర సంక్రాన్తిని అందరూ పండుగగా

చేసుకుంటున్నారు.

సూర్య సిద్ధాన్తంలో " అయినే ద్వే విషువత్ చతస్రః షడశీతయః, చతస్రో విష్ణుపద్యశ్చ సంక్రాన్త్యో ద్వాదశః స్మృతాః" అన్నట్లు మేష సంక్రాన్తి, తులా సంక్రాన్తులను రెండింటిని "విషువత్ సంక్రాన్తులని, వృషభం, సింహం, వృశ్చికం, కుంభక సంక్రాన్తులను విష్ణుపది సంక్రాన్తులనీ, మిథునం, కన్యా, ధను, ర్మీన సంక్రాన్తులను షడశీతి సంక్రాన్తులని చెప్పబడ్డాయి.

సంక్రాన్తినాడు నువ్వుల నూనెతో తలంటుకొని, నువ్వుల పిండిని శరీరమంతా పూసుకొని స్నానం చేయాలి. నువ్వుల దానం, గుమ్మిడికాయల దానం చేయాలి. పితృదేవతలకు తర్పణం వదలాలి.

"అధః పంచదశ, ఊర్ధ్వంచ పంచదశేతి" అని హేమాద్రి సిద్ధాన్తంలో చెప్పిన ప్రకారం సంక్రమణ సమయానికి ముందు పదిహేను ఘడియలు, సంక్రమణ తరువాత పదిహేను ఘడియలు సంక్రమణ పుణ్యకాలము. బృహస్పతి సిద్ధాన్త ప్రకారం సంక్రమణకు – ఉత్తరాయణ ప్రారంభానికి ముందు ఇరవై ఘడియలు, తరువాత (ఉత్తరాయణ ప్రారంభ సంక్రమణ) తరువాత ఇరవై ఘడియలు సంక్రమణ పుణ్యకాలము.

సాధారణంగా సంక్రమణకు ముందు పదహారు ఘడియలు, తరువాత పదహారు ఘడియలు సంక్రమణ పుణ్యకాలము. సంక్రమణ రోజు ఉదయాన్నే అభ్యంగన స్నానం చేసి సూర్యనారాయణ ప్రార్థన చేసి, సూర్యనారాయణ ప్రీత్యర్థమని సంకల్పం చెప్పి, శుద్ధి చేసిన స్థలంలో మండపం ఏర్పఱచి ఎఱ్ఱగుడ్డను పఱచి దానిపై అక్షతలతో అష్టదళ పద్మాన్ని వేసి అందు సూర్యనారాయణ విగ్రహాన్నుంచి పంచోపచారాలతో (స్నాన, గంధ, పుష్ప, ధూపదీప, నైవేద్యాలు) పూజచేసి ఏకభుక్తవ్రతం చేస్తే తెలిసో, తెలియకో చేసిన పాపాలన్నీ నశిస్తాయి. సూర్యనారాయణానుగ్రహంతో అన్ని వ్యాధులు నివారింపబడుతాయి.

ధర్మ స్వరూపమ్

- శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు

ధర్మమనగా వేదవిహిత కర్మ వేదనిషిద్ధ కర్మను అధర్మ మందురు. "అథాతో ధర్మ జిజ్ఞాసా" అనేది జైమినిసూత్రం. ధర్మ జిజ్ఞాసా అనగా కర్మ జిజ్ఞాస అని అర్థం.

బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సంన్యాసమనే నాలుగాశ్రమములు మానవులకు విధింపబడియుండెను. ఏ ఆశ్రమ స్వీకారము చేసినపుడు ఆయాశ్రమ కర్మల నాశ్రయించుటయే ధర్మమనబడును. ఉదాహరణకు గృహస్థాశ్రమములో 1.దేవయజ్ఞము: దేవతారాధన, 2.ఋషి యజ్ఞము: భగవద్గీత, లలిత, విష్ణు, పురుషసూక్త, శ్రీసూక్త నమకం, చమకం మొదలగునవి పారాయణ చేయుట.

3. పితృ యజ్ఞము: తల్లిదండ్రులను బాగుగా సేవించుట, వారికి తగు భోజన వసతుల నేర్పాటు చేయుట, వారి మంచిమాటలను తిరస్కరింపక వారికి సేవలందించుట. 4. అతిథి యజ్ఞము: మహాత్ములకు, అతిథులకు, బంధువులకుతగు ఆహారాదరణలు చేయుట. ఒసగుట,5. భూతయజ్ఞము: తిర్యగ్ జంతువులైన కాకులు, కుక్కలు మొదలగు జంతువులకు తగు సేవాదులు. ఈ 5 విధములైన సేవనలే ధర్మమనబడును. మానవులు, మాంసాహారభక్షణ, మద్యపానమును చేయకపోవడమే ధర్మమనబడును. పరులను హింసింపకుండుట, మనస్సుచేత, వాక్కుచేత, శరీరముద్వారా ఇతరులకు కష్టము నష్టము చేయకుండుటయే ధర్మమనబడును. "ధర్మో రక్షతి రక్షితః" అనే సూక్తి వలన ముందు తెలిసికొనిన ప్రకారం

ఆచరించుటయే ధర్మరక్షణ. వీరిని ధర్మము రక్షించును. అనగా మరుజన్మ గూడ మానవజన్మమునే మానవుడు పొందును. శుచివంతులు, శ్రీమంతులు, దైవ భక్తికి సంంధించిన జన్మలనే పొందును. ధర్మహీనులకు కష్టనష్టములను పొందెడి అశాంతి జన్మలే సంభవించును. "సాక్షాత్ అభ్యుయ నిశ్రేయసయోః యః హేతుః స ధర్మః।" ఇహపరలోకములలో సుఖములను పొందుటకు మరియు ఆత్మానాత్మ వివేకముతో మోక్షమును పొందుటకు ఏది కారణమో దానినే ధర్మమందురు. మానవజన్మలో జీవనం గౌణము, స్వస్వరూప జ్ఞానము ముఖ్యము. ధారణాదితి ధర్మః. సమస్త లోకములను ధరించినటువంటి ఆత్మకే ధర్మ శబ్దము. ధరతి లోకానితి ధర్మః । మానవులందరికి ప్రమాణమైన గ్రంథము వేదము. ఆ వేదమును తెలిసికొని ఆచరించుటయే ధర్మము.

"అనిత్యాని శరీరాణి విభవోనైవ శాశ్వతః । నిత్యః సన్నిహితో మృత్యుః కర్తవ్యో ధర్మ సంగ్రహః " అని వ్యాససంహిత.

నీటిబుడగవలె శరీరములు అనిత్యములు. ఆత్మవలె నిత్యము కానివి. ఈ శరీరము ఇంతవరకు ఉంటున్నదని గ్యారంటీ లేనిది. "శతవర్గముల వరకు మితము చెప్పిరిగాని నమ్మరాదామాట నెమ్మనమున"శరీరము నాశ్రయించుకొనే ఇల్లు. వాహనాలు, భూములు, సకలైశ్వర్యము లున్నవి. శరీరమే అశాశ్వతమని నిశ్చయమైనప్పుడు సకలైశ్వర్యములు అశాశ్వతములు. కనుక ధనాదులన్నియు శాశ్వతముగా యుండాలని భావించరాదు. మానవుడు జన్మనెత్తిన మరుక్షణము నుండి మృత్యుదేవత ఆయుస్సును హరింపజేస్తున్నది. పాము నోటిలో కప్పయుండి ఎదురుగా ఎగురుచున్న ఈగల కోసం నోరు చాచుచున్నది. కొద్ది క్షణాలలో

తన ప్రాణం పోతున్నదని కప్పకు జ్ఞానం లేనట్లు మనము గూడా మృత్యు దేవత అనే కాలసర్పం నోటిలో యుండి శబ్దాది విషయముల స్వీకరించడానికి, అనుభవించడానికి కప్పవలె ప్రయత్నిస్తున్నాము. ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరూహించెదరు అన్నట్లు ధర్మరక్షణ మన కర్తవ్యమని పై శ్లోకం చెప్పుచున్నది. "ధనానిభూమౌ పశవశ్చ గోష్ఠే భార్యా గృహద్వారే జనస్మశానే। దేహశ్చితాయాం పరలోకమార్గే కర్మానుగో గచ్ఛతి జీవఏకః" (సుభాషిత రత్నావళి)

జీవుడు శరీరమును విడచి వెళ్లేటపుడు, శరీరమును ఇచ్చటనే విడచును, శరీరమునకు సంబంధమైన ధనధాన్యాదులను, దారా సుతాదులను, పశ్వాదులను, మిత్ర, బంధు వర్గములను యిచ్చటనే విడచును. శరీరమును కాల్చివేయుదురు. మరి ఏమి తీసుకొని పోవును? అన్న ప్రశ్న వచ్చినచో, జీవించి ఏ కర్మల నాచరించెనో ఆ కర్మఫలాలను తీసుకొని వెళ్ళుచున్నాడు. ఫలానుసారంగా జన్మలను పొందును. కావున జీవించి యున్నపుడే శుభకర్మలను ప్రయత్నపూర్వకముగా చేయవలెను. మంచి జన్మల పొందును. సుఖశాంతులను పొందును.

వేదస్మృతి సదాచారః స్వస్యచ ప్రియమాత్మనః

ఏతచ్చతుర్విధం ప్రాహుః సాక్షాద్ధర్మస్య లక్షణమ్। (మనుస్మృతి)

నాల్గు వేదములు, మన్వాది స్మృతులు., భాగవతాది పురాణములు. సత్పురుషుల ఆచరణ, ప్రతి జీవికి సంతోషమును కలుగజేయుట ఇవి సాక్షాత్ ధర్మ లక్షణములు.

ఓం కాస్సమస్తాస్సుఖినో । భవన్తు శాన్తి శ్శాన్తి శ్శాన్తిః. ॥

శ్రీ మలయాళస్వామి జీవిత విశేషాలు - 16

ఆత్మహత్యా యత్నం - ఆకాశవాణి

- డా॥ సముద్రాల లక్ష్మణయ్య, (తిరుపతి)

స్వామి గోగర్భంలో ఉన్నప్పుడు గ్రంథరచన, ధర్మప్రబోధం, శిష్య సంశయ నివారణం మున్నగు లోకోద్ధారక కార్యక్రమాలు నిర్వహిస్తూనే తపోనిష్ఠలో కొనసాగుతుండేవారు. ఈ నిష్ఠకు ఏ మాత్రం భంగం కలుగకుండా చూచుకొనేవారు.

అలా తొమ్మిది సంవత్సరాలు గడచిపోయాయి. వారి కీర్తిప్రతిష్ఠలు ఆంధ్రావని అంతటా వ్యాపించాయి. కాని వారు ఆశించిన ఆత్యంతిక దుఃఖ నివృత్తి, పరమానంద ప్రాప్తి లభించలేదు. తానింతకాలమూ చేసిన సాధనలకు ఫలమేమి? సంపూర్ణమైన ఆత్మశాంతి ఎప్పుడు లభిస్తుంది? అన్న విచారం వారికి కలిగింది.

" పుట్టిన దాదిగా నిన్నే ఆశ్రయించాను. వైరాగ్యంతో భోగభాగ్యాలు పరిత్యజించాను. యోగమార్గం జవదాటకుండా ఉన్నాను. నా వారినెల్ల విడిచి వచ్చాను. నీవే దిక్కని నమ్మాను. పాదచారంతో పుణ్యతీర్థ యాత్రలు చేశాను. పూజాదులనుష్ఠించాను. ప్రణవోపాసన వదలిపెట్టలేదు. ఇలా తొమ్మిది సంవత్సరాలు గడచిపోయాయి. పరమేశ్వరా! అయినా నిశ్శేషశోక శాంతి, నిరతిశయానందప్రాప్తి సిద్ధించలేదే ? పురాణ గాథలన్నీ అసత్యాలా? ఇట్టి లోకంలో జీవించడమెందుకు?" ఈ విధమైన విచారంతో గురుదేవులు ఆత్మహత్యా ప్రయత్నానికి సిద్ధపడ్డారు. పాషాణం మ్రింగితే అంత్యకాల భగవత్స్మృతి ఉండదే? ఎత్తైన కొండపై నుండి దూకితే ప్రాణపరిత్యాగకాలంలో ఎలాంటి సంకల్పం కల్గుతుందో ఏమో ? దాని పరిణామమెలా ఉంటుందో?

"ఇక మూడు దినాలు వేచిచూస్తాను. ఆత్మసాక్షాత్కారం కలగకపోతే ఏ రీతిగానైనా ప్రాణపరిత్యాగం చేస్తాను" అంటూ ఒక నిశ్చయానికి వచ్చారు. అప్పుడా రాత్రి ఆకాశవాణి దివ్య వచనాలు ఇలా వినిపించాయి. "సాధకుని సాధన సమయంలో పూర్ణ దైవభావమయమైన కాలమే లెక్కలోకి వస్తుంది. అట్టి క్షణాలు, నిమిషాలు, గంటలు మాత్రమే పరిగణించాలి. అలా పండ్రెండు సంవత్సరాలు గడవాలి. అప్పుడే బ్రహ్మనిష్ఠ ఫలిస్తుంది" దీనితో తన నిష్ఠాకాలం ఇంకా పూర్తికాలేదన్న అవగాహన స్వామికి కల్గింది. ఆపై పూర్ణ బ్రహ్మ భావనతో కాలం గడిపారు. మరల మూడు సంవత్సరాలు అలా గడచాయి. అప్పుడు బ్రహ్మసాక్షాత్కారం లభించి పరిపూర్ణమైన ఆత్మశాంతి లభించింది. తరువాతి కాలంలో స్వామి ఇలా చెప్పియున్నారు. 'పూర్ణ బ్రహ్మనిష్ఠలో 12 సంవత్సరాలుంటే దైవసాక్షాత్కారమై తీరుతుంది. లేకుంటే నా శిరస్సు అర్పిస్తాను. ఇప్పటి వారి ధ్యానం భాషలోకే గాని భావంలోకి పోవడం లేదు. మంత్రం వరకే కాని మంత్రార్థం వరకూ పోవడం లేదు. నేనట్టి దీక్ష చేశాను. శోకశాంతి ఆనందప్రాప్తి కల్గింది. రోజుకొక లక్ష రూపాయలు బ్యాంకులో వేసినంత తృప్తి సమకూరింది. దాని వడ్డీనే మీరిప్పుడనుభవిస్తున్నారు.

" ఓ పర్వతమా! ఆవలికిపో' అంటే అది పోగలదన్నంత విశ్వాసం నాకుండేది". స్వబోధ సుధాకరమన్న గ్రంథంలో బ్రహ్మనిష్ఠునికి కలిగే సుఖమెలాంటిదో స్వామి విపులముగా వర్ణించియున్నారు. అందులో కొంత భాగం ఈ క్రింద చూడండి. "ఓహో! ఎంత సుఖము? ఓహో 'ఏమి మాధుర్యము! ఎట్టి అద్భుతము ! ఇది అమృతసాగరమా ? లేక జ్ఞానగిరియా? ఓహో! ఇక్కడ మనస్సు మననము చేయజాలక నిల్చిపోవుచున్నదే! బుద్ధి నిశ్చయము చేయనొల్లక నిశ్చేష్టత నొందుచున్నదే! చిత్తము చింతనము చేయజాలక సంకోచించుచున్నదే ! ఇచ్చట అహంకారము అహంకరింప జాలక సోఽహం పరమగుచున్నదే! ఇది యేమి ఆశ్చర్యము! ఏమి మహిమ! ఇచ్చట నా మనస్సు మదపుటేనుగు సింహము సన్నిధిలో అణగునట్లు

అణగిపోయినది. పరిపరి విధములుగా దృశ్యములపై పరుగెత్తెడు వృత్తులన్నియు సింగమును జూచిన జింకలవలె నిశ్చేష్టములైనవి. అజ్ఞానము మండుచున్న మహాగ్నిలో శుష్కతృణ పుంజమువలె కాలుచున్నది. ఇదేమి చిత్రము ! ఇచట కర్పూరము అగ్నిలో జ్వలించునట్లు కర్మలన్నియు కాలికాలి కనుమరుగైపోవుచున్నవే! పంచదార నీటిలో కరగునట్లు దృశ్యమంతయు దైవమయమై దృక్కుగా మారుచున్నది. సూర్యుడుదయించునప్పుడు చీకటి కనపడనట్లు నాకు అవిద్య కనిపించుట లేదు. కొలిమిలో వేసిన లోహఖండములన్నియు అగ్నిమయములై ప్రజ్వలించునట్లు నా యింద్రియములన్నియు ఈశ్వరమయములుగా మారుచున్నవే !"

(ఇది ఇంకా ఉన్నది. స్వబోధసుధాకరంలో పఠించండి)

వేదాన్తభేరికి ఈ క్రిందివారు పోషకచందా పంపినారు

1. శంకర్‌నాగయ్య, బాలే (ముంబాయి) - రూ.1500/-
2. డి.వీరప్ప (చేతంచర్ల) - రూ.1500/-
3. గుమ్మడి కనకదుర్గా భవాని (కొడాలి) - రూ.1500/-
4. ఆర్.వి.చెంచులక్ష్మి (చెన్నై) - రూ.1500/-

సద్గురు సేవా ట్రస్టుకు క్రిందివారు పైకం పంపినారు

1. బాలె నాగయ్య (ముంబాయి) - రూ.15000/-
2. పి.ప్రమీలాదేవి (గగనమహల్, హైద్రాబాద్) -రూ.1,00,000/-
3. పి.విజయకుమార్‌రెడ్డి (గగనమహల్,హైద్రాబాద్) -రూ.10,116/-
4. పి.ప్రమీలాదేవి (దోమలగూడ,హైద్రాబాద్) - రూ.50,116/-
5. కె.మురళి (నిజామాబాద్ - రూ.20,000/-
6. కె.మురళి (పి.ప్రసాద్ , నిజామాబాద్) - రూ. 20,000/-

ఆంజనేయస్వామికి ఆకుపూజ

– డా॥ ఆచార్య కె. సర్వోత్తమరావు, (తిరుపతి)

మానవులకులాగే దేవతలకు కూడా ఇష్టాయిష్టాలున్నాయి. ఆ ఇష్టాయిష్టాలు ఆలయాలలో పూజాది సమయాలలో సుస్పష్టంగా కనబడతాయి. మహావిష్ణువుకు సంపంగి, తులసి, పద్మాలు చాలా ఇష్టమయితే, పరమ శివునికి బిల్వపూజ చాలా ఇష్టం. అలాగే ఆంజనేయస్వామికి తమలపాకు పూజ చాలా ఇష్టమని భక్తులు ఆ సేవను చాలానిష్టతో, ఆనందంతో చేస్తుంటారు. ఎందుకీ ఆకుపూజ? అని అడిగితే చాలామంది ఇది శాస్త్రమంటారు. గట్టిగా అడిగితే తమకు తెలియదంటారు. పూజారులను అడిగితే ఇది సంప్రదాయమంటారు. ఏది ఏమైనా ఆకుపూజలు స్వామికి జరుగుతూనే ఉంటాయి. ఆ పూజాఫలితాలు భక్తులకు ప్రత్యక్షపరోక్ష రూపంలో లభిస్తూనే ఉంటాయి. ఈ ఆకుపూజకు సంబంధించి తమిళనాడులో ఒక విశిష్టమయిన కథ ప్రచారంలో ఉంది.

రావణుడు సీతాదేవిని అశోకవనంలో రాక్షస స్త్రీల మధ్య బందీ చేశాడు. ఆ అశోకవనమంతా రకరకాల వృక్షసముదాయంతో అందంగా ఉంది. ఒకరకంగా సీతాదేవికి వనవాసంలో ఉన్నట్టుగానే ఉంది. సీతాన్వేషణ కోసం హనుమంతుడు సముద్రలంఘనం చేసి అమ్మవారిని దర్శించాడు. శ్రీరామచంద్రుని అంగులీయకాన్ని ఇచ్చి రామలక్ష్మణుల సౌందర్యాన్ని వర్ణించి త్వరలోనే సీతమ్మకు, అశోకవనవాసానికి విముక్తి కలిగిస్తాడని నమ్మబలికాడు. రాక్షసగణం మధ్య ఉన్న సీతాదేవి అంగులీయక దర్శనంతో శ్రీరామచంద్ర గుణాకర్ణనంతో మురిసిపోయింది. ఆనందభాష్పాలతో హనుమ ఇంతటి సంతోష వార్త నాకు వినిపించిన నీకు ఏమీ ఇవ్వలేకపోతున్నానే అని బాధపడింది. చివరకు చుట్టూ కలయచూసింది. అక్కడి నారికేళ వృక్షాలకు అల్లుకున్న తమలపాకు తీగలను చూచింది. చటుక్కున ఆమె మెదడులో ఒక ఆలోచన మెరిసింది. తిన్నగా వెళ్ళి తమలపాకులను కోసి దండగా గుచ్చి హనుమంతుని మెడలో వేసి – "హనుమా! ఇంతకంటే నేను నీకు ఏమీ ఇవ్వలేకపోతున్నా'' నన్నది. అపుడు హనుమ ''అమ్మా! నీచేత సత్కరింపబడుటయే నా పూర్వజన్మ సుకృతమన్నాడు. ఆనందంతో తబ్బిబ్బయ్యాడు. ఆ తరువాత పట్టాభిషేక సమయంలో రాముడిచ్చిన ముత్యాలహారం కూడా అంతటి సంతోషాన్నివ్వలేదట. ఈ కారణం వల్లనే హనుమంతునికి ఆకుపూజ చేయడం ఒక సంప్రదాయంగా మారిందంటారు.

హనుమంతుణ్ణి ద్రావిడ దేవత అని కొందరంటారు. ద్రావిడ దేవతలకు శాకాహారం చాలా ఇష్టం. వానర సంతతికి 'శాఖా' మృగమని పేరు. ఆకులలములు, పళ్ళు స్వామికి చాలా ఇష్టం. అందుకే అరటి పళ్ళు, ఆకుపూజ రెండూ హనుమంతునికి అర్పించడం.

7వ భాగవత సదస్సు

శ్రీకాళహస్తి శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరుగుచున్న సప్తమ-**7వ** భాగవత సదస్సు **16-01-2019వ తేది నుండి 22-01-2019**వ తేది వఱకు **ఏడు రోజులు** జరుగును. **పూజ్యశ్రీ మాతా శివానంద సరస్వతి స్వామినివారు (చైతన్య తపోవన స్థాపకులు, అధిపతులు, తాడేపల్లి)** సప్తమ స్కంధంపై ప్రవచన చేస్తారు. అందరు వచ్చి విని తరించండి.

8వ భాగవత సదస్సు

శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో 8వ భాగవత సదస్సు **23-01-2019 తేది నుండి 29-01-2018 తేది వరకు ఏడు రోజులు** జరుగనున్నది. ఇందు **పూజ్యశ్రీ శ్రీ ప్రణవానందగిరిస్వాములవారు (ఉమామహేశ్వర పీఠాధిపతులు, లత్తవరం)** అష్టమ స్కంధంపైన ప్రవచన చేస్తారు.

అందరికీ ఆహ్వానము.

ఉద్ధవ గీత – భిన్నంగా కనిపిస్తున్న ఏకత్వం

మూలం : రచన :

శ్రీ వ్యాసమహర్షి యేలేశ్వరపు హనుమరామకృష్ణ

ఉద్ధవుడు: హే భగవాన్! ఈ జగత్తులో వేరు వేరు గుణ సంయోగములచే జీవులు, జ్ఞానులు, అజ్ఞానులు, విజ్ఞులు, మూర్ఖులు, మునులు, మహర్షులు, భక్తులు, యోగులు, ఇంద్రియలోలులు, ఇత్యాది వేరువేరైన – రకరకముల స్వభావములుగా కనిపిస్తున్నారు కదా ! వీరంతా ఎవరి సంకల్పము చేత వివిధ రీతులుగా ఉత్పన్నమౌతున్నారు ? పరమాత్మచేతనేనా ? మరొకరి చేతనా ? జీవుని స్వభావానికి సంబంధించిన కర్తృత్వము జీవునిదా ? ఈశ్వరునిదా ? పరమాత్మదా ? మరింకెవరిదన్నానా?

శ్రీకృష్ణుడు : ఇక్కడ ఏకము – అక్షరము అగు పరమాత్మయే ఉన్నారు. ఏకైక పరమాత్మయే వివిధ రూపములుగా మనస్సుచే పొందబడుతోంది. ఏకోసత్ ! ఏకమే అయివుండి భావావేశ రూపమగు మనస్సుచే అనేకముగా భావించబడుతోంది !

ఒక వేళ.., నీకు – కర్మ – కర్తృత్వము, భోక్తృత్వము, సుఖము – దుఃఖముల దృష్ట్యా వేరువేరుగా కనిపించేదంతా నిత్యమని, సత్యమని అనిపిస్తోందా? సర్వ భోగ ప్రతిపాదితములైన శాస్త్రముల దృష్ట్యా సుఖ – దుఃఖములు, స్వర్గ – నరకాది వివిధ లోకములు, జీవుల రాక– పోకలు వాస్తవమేనని భావిస్తున్నావా? ఆయా వస్తుప్రభావం చేత అజ్ఞానం – జ్ఞానం ఉత్పన్నమై, కాలాంతరంగా మారుతూ వుంటుందని అనుకోదలచావా? అట్లా అయితే..

అప్పుడు ఈ జీవుల దేహములు, సంవత్సరముల రూపంగా కనిపించే కాలము ఆ కాలముచే ఏర్పడే జనన బాల్య –యౌవన–వార్ధక్యాది అవస్థలు కూడా స్వతహాగానే సత్యమని నిత్యమని అనుకోవలసివస్తుంది!

అప్పుడు ఈ జీవుడు ఏదో శక్తిచేత నియమితుడై పరతంత్రుడై సుఖదుఃఖాలు అనివార్యంగా అనుభవిస్తున్నాడు –అని సమీక్షించవలసి వస్తుంది.

(If he is under strict control of some out - side Force) ఇక పరతంత్రుడైనవాడు తానుగా మోక్షం పొందలేడని, ఎవ్వరో ఎక్కడి నుండో అతనికి మోక్షం ప్రసాదించవలసి యున్నదని చెప్పవలసి వస్తుంది.

అనగా...శాస్త్రములు తాము చెప్పే సాధనలు నిర్వర్తించటానికి కూడా జీవుడు స్వతంత్రుడు కాదని, సాధనలు కూడా దైవము అనబడే మరొకరి అధీనంలో వున్నాయని అనవలసి వస్తుంది.

శాస్త్రములు అట్లా చెప్పటం లేదుకదా ! “సాధన చేయవయ్యా! పొందుతావు” అని గదా చెప్పుచున్నది!

ఉద్ధవుడు: అవునయ్యా! సాధనచే మోక్షం లభిస్తుందని సూచిస్తున్నాయి కృష్ణయ్యా! నాకొక అనుమానం. ఈ జీవుడు పారతంత్రుడా? స్వాతంత్రుడా?

శ్రీకృష్ణుడు: ఒక వేళ జీవుడు పారతంత్రుడై (Under control of some remote force) సాధనములు గాని, జన్మ –మృత్యు – పునర్జన్మలుగాని పొందుచున్నాడని సిద్ధాంతీకరించ వలసివస్తే... అప్పుడు శాస్త్రములు జీవునితో నాయనా! నీవు బ్రాహ్మీ ముహూర్తంలో నిదురలే! సాధనలకు ఉపక్రమించు!..అని సంబోధించి ప్రయోజనం ఏమిటి? అందుచేత అనేకత్వము – పారతంత్ర్యము (Multiplicity and forced bondage) అనివార్యమని చెప్పవలసి వస్తే శాస్త్రములు తాము చెప్పే సాధనల ప్రయోజనములను తామే ఖండింపవలసి వస్తుంది.

పరాధీనము (Remotely controled by some body) అయినట్టివానికి ఎట్టి పురుషార్థము సిద్ధించదు కదా ! తానుగా ఏమీ చేయలేనప్పుడు శ్రద్ధ – సాధనాల గురించి శాస్త్రాలు నొక్కి వక్కాణించట మెందుకు?

ఉద్ధవుడు: హే సద్గురూ! వేదములచే విధి – విధానపూర్వకంగా చెప్పబడే దేవతోపాసన యజ్ఞయాగాది క్రతువులు ఎరిగిన పండితులు జీవుడు ఇహంలో సుఖం – పరంలో స్వర్గలోకాది సుఖశాంతులు పొందాలంటే దేవతోపాసన, యజ్ఞ – యాగాలు నిర్వర్తించాలి. వేద విభాగాలైన యజ్ఞ యాగ విధానం తెలిపే సంహిత బ్రాహ్మణముల పాండిత్యము లేకపోతే ఈ జీవునికి ఉద్ధరణ లేదు – అని అంటూ వుంటారు కదా! అట్టి కర్మవిదుషుల ప్రతిపాదన గురించి తమ అభిప్రాయం చెప్పండి!

శ్రీకృష్ణుడు: నీవు చెప్పిన కర్మకుశలురకు (దేవతోపాసకులకు) (Experts in yagna / yaga / vedavignana) ఎల్లప్పుడు సుఖమే లభిస్తోందని మనం చెప్పలేం. అట్లాగే అట్టి విషయాలలో నిష్ణాతులు కాని మూఢులకు దుఃఖములే వస్తున్నాయని కూడా సిద్ధాంతీకరించలేము.

ఒకవేళ, వేద ప్రవచిత కర్మల రహస్యం తెలిసినవారికి సుఖ దుఃఖ విఘాతాల గురించి తెలియవస్తోంది... అని అందామా? అయితే వారివద్ద కూడా అనివార్యమగు మృత్యువు సంభవించకుండా ఉపాయాలు లేవుకదా! మృత్యు భయం కొనసాగుచునే ఉండగా, కర్మల వలన కోరికలు తీరుతాయి... అనే ప్రయోజనం నిష్ఫలమేకదా? ఉరితీయటానికి తీసుకుపోబడుచున్న మానవుడికి సుగంధద్రవ్యాలు ఇస్తే అవి అతనికి ఏం సుఖం? అట్లాగే మృత్యువును ఎదురుగా పెట్టుకొని, **మీరు ఈ ఆ కర్మలు చేయండి ! అప్పుడు ఈ ఆ సుఖాలు పొందుతారు..** అని శాస్త్రీకరించటం అటువంటిదే కదా!

పోనీ! యజ్ఞ యాగ కర్మలు నిర్వర్తించటానికి ఇప్పుడు శ్రమిస్తే ఉత్తరోత్తరా స్వర్గలోకంలో స్థానం, స్వర్గ సుఖాలు లభిస్తాయి – అని కర్మ వాదులు అంటారంటావా? స్వర్గలోకంలో లభించే సుఖాలకు కూడా స్పర్ధ – అసూయ – క్షయము – నాశనము (Conflictmutual Hatred -Decrease - End all) అనేవి ఉండియే తీరుతాయి. అనగా స్వర్గసుఖాలు

కూడా ఇక్కడి ధనము –గృహములు మొదలైన ఐహిక భౌతిక సంపదలవలెనే అనేక దుఃఖములతో కూడుకొని ఉన్నవే కదా! (They are also accompanying many worries)పైగా,యజ్ఞ యాగరూపములైన కృషికర్మలు నిర్వర్తించేటప్పుడే అవన్నీ కూడా అనేక శ్రమలు, విఘ్నములతో కూడుకొని ఉంటున్నాయి.

సరే! ఆ విఘ్నములన్నీ అధిగమించి అవి నిర్వర్తించినా కూడా, వాటి ఫలితంగా దేహపతనానంతరం లభించే స్వర్గలోక సుఖాలు మాత్రం శాశ్వతమా? కాదే!

ఎట్లా అంటావా?

యజ్ఞములు చేసే పురుషుడు ఈ లోకంలో ఆ యజ్ఞముల ద్వారా దేవతలను ఆరాధించి స్వర్గమును పొందుచున్నాడు. తాను చేసిన పుణ్యకర్మలకు ప్రయోజనంగా స్వర్గలోకంలో, దేవతాలోకాలలో దివ్య భోగాలు అనుభవిస్తున్నాడు. మనోహరమైన ఆభరణాదులు ధరించి దేవతా విమానాలలో దేవతా స్త్రీల మధ్య విహరిస్తున్నాడు. గంధర్వ గణముచే కీర్తించబడుచున్నాడు. అయితే! అవన్నీ ఇంద్రియ – విషయ సంబంధమైన భోగ విలాసములే కదా! దేవతా స్త్రీలతో కలసి నందనవనాలలో విహరిస్తున్నంతవరకు – ఈ భోగమంతా కొంతకాలానికి ముగిసిపోయి, "నాకు పతనం అనివార్యం" – అని గమనించకుండానే కాలం గడిపివేస్తూ వుండవచ్చుగాక! పుణ్యమున్నంతవరకే స్వర్గలోకం! పుణ్యము క్షీణించగానే కాలముచే త్రోయబడి తిరిగి క్రిందకు రావలసిందే!

ఉద్ధవుడు: అలా యజ్ఞ యాగ దేవతోపాసనాది కర్మలు కాకుండా ... ఇంద్రియలోలుడై దుష్టసంగముతో అధర్మరతుడై, ఇంద్రియ వాంఛలకు వశుడై జీవితమును గడపివేస్తేనో... ? లోభ బుద్ధితో దానము ధర్మము వంటి సత్కార్యాలు నిర్వర్తించకుండా ఇతరులను మోసగించటం,

బాధించటం మొదలైన దుష్టకర్మల లంపటంలో ఆయుష్షును వెచ్చిస్తూ వుంటేనో..?

ప్రాణి హింస చేస్తూ అమాయక జంతువులను హింసిస్తూ భూత – ప్రేత – పిశాచాదులను ఉపాసించి, ప్రకృతి శక్తులతో ఇతరులకు భయము – హాని కలుగజేస్తూ వుంటేనో .. ?

శ్రీకృష్ణుడు: అప్పుడా జీవుడు పశువుల కంటే కూడా హీనమైన నరకయాతనలు గల లోకాలలోకి కాలముచే నెట్టివేయబడుచున్నాడు. స్వార్థ– పరమార్థ శ్రేయస్సు లభించక అజ్ఞానముతో కూడి అనేక అల్ప ఉపాధులలో రాక – పోకలు నిర్వర్తిస్తున్నాడు.

అందుచేత ఓ ఉద్ధవా !

శ్లో ॥ కర్మాణి దుఃఖోదర్కాణి కుర్వన్ దేహేన తైః పునః

దేహమాభజతే తత్ర! కిం సుఖం మర్త్యధర్మిణః? (అధ్యా 10, శ్లో 29)

ఈ దేహముచే చేయబడే కర్మలు వాస్తవానికి ఒక రకంగా దుఃఖ జనకములే! ఎందుకంటే అవన్నీ జన్మ – మృత్యు పరంపరలు కొనసాగటాన్ని ఆపలేకపోతున్నాయి. మరి? మరణము అనివార్యమై ఉండగా, ఈ జీవునికి లభించగల వాస్తవ సుఖం ఈ జగత్తులో ఏమున్నది? (లేక) ఏ లోకంలోనైనా ఏమున్నది చెప్పు?

అనంతకాలము యొక్క సుదీర్ఘ ప్రదర్శనలో లోకాలు – లోక పాలకుల జీవితాలే అల్పకాలానికి పరిమితమై వుంటున్నాయి. లోకాలు మహా అయితే ఇక కల్పము వరకు కొనసాగుతాయి. బ్రహ్మదేవుడు కూడా కాలపరిమితుడే కాబట్టి, కాలస్వరూపుడనగు నన్ను చూసి భయమును పొందటం జరుగుతుంది. ఇక మానవుని ఆయుః పరిమాణం గురించి వేరే చెప్పేదేమున్నది? స్వర్గము మొదలైన లోకములలో నివాసం కోరుకొని మాత్రం శాశ్వత ప్రయోజనమేమున్నది ? ప్రకృతిలోని సత్త్వ – రజో–తమో

గుణాలు కర్మలను (Individual Roles and functions) కల్పిస్తూ వుంటాయి.

ఆ కర్మల నుండి గుణాలు, మరల గుణముల నుండి కర్మలు !

గుణములతో తాదాత్మ్యము చెంది ప్రవర్తించే జీవుడు ఆ కర్మల ఫలములను అనుభవిస్తూ ఆ అనుభవం నుండి గుణ – కర్మలను అంతులేని ప్రవాహం లాగా కొనసాగిస్తూనే వుంటాడు. ఎంతెంతవరకైతే త్రిగుణములనబడే వైషమ్యం దృష్టియందు కొనసాగుచూ వుంటుందో... అంతంత వరకు ఈ జీవునిపట్ల – "నేను వేరు – వారు వేరు– దేవతలు వేరు – మంచివారు వేరు – చెడువారు వేరు – పాపములు –పుణ్యములు –సుఖములు –దుఃఖములు – స్వర్గము – నరకము "... ఇటువంటి నానాత్వమంతా ఉండియే ఉంటుంది. ఈ జీవుడు నిజం – నిజం అనుకుంటూ నానా రూపములు పొందుచూనే ఉంటాడు. **బుద్ధియందు కల్పితమగు నానా రూపములు కొనసాగునంతవరకు జీవునికి కర్మలకు అధీనత్వము – పారతంత్ర్యము ఉండియే తీరుతోంది!** అట్టి కర్మాధీనం ఉన్నంత వరకు కర్మ ఫల ప్రదాత నుండి సాంసారిక భయం ఏర్పడుతూనే వుంటోంది. గుణ వైషమ్యము, అద్దానిచే భోగానుభవము – బంధము ఉంటూనే ఉంటాయి. బంధకారణంగా కర్మల అనివార్యంగా, బలవంతంగా నిర్వర్తించటం – కర్మవలన సుఖ దుఃఖాలు...ఇవన్నీ చేయి చేయి కలుపుకుని కొనసాగుచున్నాయి.

కర్మ – కర్మ ఫలముల పట్ల ఆశ – అభినివేశము – నమ్మకము కొనసాగుచున్నంత వరకు ఈ జీవునికి శోక – మోహములు తప్పేవి కావు. త్రిగుణమాయకు లోను అయిన జీవులు పరమాత్మయగు నన్ను – కాలము – లోకము –స్వభావము – ధర్మము ఇటువంటి రూపములుగా దర్శిస్తాడే గాని, **"పరమాత్మ నా స్వస్వరూపమే!"** అనే విషయం గమనించలేకపోతున్నాడు.

జీవుడా! మేలుకో!!

– శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

మనసు బుద్ధియు నీవు కాదన్నా
నీ స్వరూపము ఆత్మయేయని తెలిసికోరన్నా
ఆత్మయందున నిష్ఠ గలిగి
దృశ్యమందున రోత జెంది
జీవితాంతము కాకపూర్వమె
బ్రహ్మపదవిని బొందు రయమున.
తత్త్వసారము తెలిసికోరన్నా
సద్గురునిచెంత, నిజము గనుగొని లాభమొందన్నా. **105**

జలమందు గొప్ప బలమును ప్రదర్శింపగల మొసలి భూమిపైకి వచ్చినచో అది తన శక్తిని చూపజాలదు. అటులనే ఇంద్రియము, మనస్సు, బుద్ధి అనునవి నశ్వరదృశ్య ప్రపంచమున మాత్రమే చైతన్యవంతములుగ తోచును. కాని శాశ్వత ఆత్మసామ్రాజ్యమున అవి జడస్వరూపములే, నిర్వీర్యములే యగుచున్నవి. ఇంద్రియములుగాని, మనస్సుగాని, బుద్ధిగాని జీవుని యథార్థ స్వరూపము గావు. వాటికి సాక్షిగ ఉండు ఆత్మయే జీవుని వాస్తవ స్వరూపము.

కావున ఓ మనుజుడా! ఓ జీవుడా! అజ్ఞానభ్రాంతిని విడనాడు. జ్ఞాన జ్యోతిని సంపాదించుటకై దృఢయత్నము గావించు. జడస్వరూపములు, మిథ్యారూపములు, అసత్పదార్థములు అగు

దేహేంద్రియమనోబుద్ధులతో ఏల తాదాత్మ్యము చెందియున్నావు? అవి నీవు కాదు. శరీరాత్మభావన నీ ఆత్మోన్నతికి అడ్డుగా ఉన్నది. పైగా అది నీకు అనంత దుఃఖములనే పొందించుచున్నది గాని పూర్ణశాంతిని ఏ మాత్రము ఒసంగజాలకున్నది. పరిపూర్ణ శాంతిస్థానమును, ఆనందధామమును, ఆత్మలోకమును చేరదలచితివేని దేహాదులందు అభిమానమును, ఆసక్తిని వదలిపెట్టు. నాశవంతములగు ఇంద్రియ విషయములపై కోరికను త్యజించు. నిత్యసుఖమును, బంధవిముక్తిని ఒసంగగల ఆత్మధ్యానమునే, దైవసేవనే ఆశ్రయించు. దృశ్యమందు రోత గలిగి, ఆత్మనిష్ఠాపరుడవై జీవితమును గడుపు. బ్రహ్మధామమును చేరుటకు సద్గురునాథుని శరణుపొందు. తత్త్వసారము తెలుసుకో. గురూపదేశ మార్గమున సాధన సలిపి, భక్తి జ్ఞాన వైరాగ్య సంపన్నుడవై బ్రహ్మపదవిని అధిష్ఠించు. శాశ్వత సౌఖ్యమును అనుభవించు. అమూల్య నరజన్మను సద్వినియోగపరచుకో.

సంవత్సర చందా దారులకు విజ్ఞప్తి

ప్రియాత్మ బంధువులారా ! వేదాన్తభేరి పత్రికకు మీ సంవత్సర చందా డిశంబరు నెలలో పూర్తి అయినది. కాబట్టి వెంటనే **మీ సంవత్సర చందా నూరు రూపాయలను యం.ఓ. ద్వారా పంపి రెన్యూవల్ చేసుకోవలసిందిగా కోరుచున్నాము. ఆధ్యాత్మిక పత్రికలను** నడపడం ఎంతో వ్యయ ప్రయాసలతో కూడిన పని అని మీకు తెలిసిన విషయమే. అందుచే మీ సంవత్సర చందాను వెంటనే పంపి మాకు చేయూత నివ్వగోరుచున్నాము.

ఒక చెంచా కరివేపాకు రసం, ఒక చెంచా వెల్లుల్లి రసం కలిపి అందులో చిటికెడు పసుపు, కొంచెం తేనెను కలిపి రోజూ ఉదయం, సాయంత్రం 15 రోజులు తీసుకుంటే ఉబ్బస వ్యాధి తగ్గుతుంది.

శ్రీ మదాంధ్ర మహా భాగవతం

- డాక్టర్ ఆచార్య జక్కంపూడి మునిరత్నం (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

విశ్వ విధానం:

నారదుడు బ్రహ్మను అనేక విధాలుగా ప్రశంసించాడు. తన సందేహాలను తీర్చమని కోరాడు.

"తండ్రీ! నువ్వు ఈ సృష్టికే జనకుడివి. ఈ ప్రపంచాన్ని సృష్టించేందుకు కావలసిన విజ్ఞానాన్ని ఎవరు నీకు ప్రసాదిస్తున్నారు? ఈ సృష్టి నిర్మాణానికి హేతువును, ప్రయోజనాన్ని తెలియజేయి, దీని స్వరూపాన్ని కూడా వివరించు. నీకు సైతం వేరే ప్రభువున్నాడా? లేక నువ్వే సమస్తానికి ప్రభువువా? ఈ జీవులంతా ఎక్కడ నుంచి పుడుతున్నారు? ఎక్కడ ఉంటారు? తరువాత ఎందులో కలిసిపోతారు? వివరంగా నాకు చెప్పు. సత్తు అసత్తు నామరూప గుణాలతో కనిపించే ఈ ప్రపంచం నీ సంకల్పానికి లోబడి ఉండేదేకదా ! నీ సాటివారు కాని, మేటివారు కాని ఉండరని నా అభిప్రాయం. అలాంటి నువ్వు కూడా ఏ పరమేశ్వరుణ్ణి ఉద్దేశించి తపస్సు చేశావు? ఆ పద్ధతిని కూడా నాకు తెలియజేయి. నీకు సైతం ఒక ప్రభువుంటే ఆయన స్వరూపాన్ని కూడా నాకు బోధపరచు.ఆ ప్రభువు అనుగ్రహంతో ఈ ప్రపంచ సృష్టి స్థితిలయాలు ఏవిధంగా జరుగుతున్నాయో చెప్పు. నువ్వు త్రికాలవేత్తవు కాబట్టి ఈ ప్రపంచ విధానాన్ని గురించి నిన్ను అడుగుతున్నాను. తండ్రీ! ఈ విషయాలన్నిటినీ విడమరచి చెప్పు. ఇవన్నీ నాకు అర్థమైతే నన్నుసరించేవాళ్ళకు కూడా చెబుతాను. వాళ్ళెవరూ ఇతర మార్గాలను అవలంభించకుండా చూస్తాను."

నారదుడి ప్రశ్నలు బ్రహ్మకు సంతోషాన్ని కలిగించాయి. ఆయన

నాలుగు ముఖాలు వికసించాయి. నారదుడి పట్ల ప్రసన్నుడయ్యాడు. చెప్పడం మొదలెట్టాడు.

"నారదా! నా దగ్గరికి ఎందరో వస్తుంటారు. వారెవ్వరూ ఇంత గొప్ప విషయాన్ని అడగలేదు. నా ప్రభువును గురించే నువ్వు అడిగావు. నాకెంతో సంతోషంగా ఉంది. చెబుతా విను. ప్రపంచాన్ని సృష్టించాలనే కోరిక నాకున్నప్పటికీ దానికి కావలసిన శక్తి, విజ్ఞానం నాకు లేవు. వాటిని ఆ ప్రభువే నాకు ప్రసాదించాడు. ఈ ప్రపంచాన్ని ప్రకాశింపజేసే శక్తి కూడా నాకు లేదు.సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు ఇవన్నీ ఎవరి కాంతిచేత ప్రకాశిస్తున్నాయో ఆ పరమేశ్వరుడి ప్రకాశం వల్లనే ఈ లోకాలన్నీ ప్రకాశిస్తున్నాయి. అటువంటి ప్రభువుకు నేనెప్పుడూ నమస్కరిస్తాను.

శరీర నిర్మాణానికి తోడ్పడే పంచభూతాలు, పుట్టుకకు కారణమైన కర్మలు, కర్మ ప్రవృత్తికి మూలమైన కాలము, కాలం మార్పుకు కారణమైన స్వభావము, కర్మఫలాన్ని అనుభవించే జీవుడు ఇవన్నీ కూడా ఆ వాసుదేవ స్వరూపమేనని గ్రహించు. ఆ దేవుడికంటే ఇతరమైంది ఏదీ ఎక్కడా లేదు. జగన్నియామకుడు ఆ నారాయణుడు మాత్రమే. దేవతలంతా కూడా ఆయన శరీరము నుంచి ఆవిర్భవించిన వాళ్ళే. వేదాలు, యాగాలు, తపస్సులు, ప్రాణాయామాలు మొదలైన యోగాలు, సమస్త విజ్ఞానము ఆ నారాయణుణ్ణి ఆరాధించేందుకు ఏర్పడ్డవే. జ్ఞానఫలం కూడా నారాయణుడి అధీనమే. ఆ భగవంతుడి కడగంటి చూపుతోనే నేను పుట్టాను. ఆయన ప్రేరణతోనే సృష్టి సాగిస్తున్నాను.

ఆ పరమేశ్వరుడికి గుణాలు లేనప్పటికీ సత్వము, రజస్సు, తమస్సు అనబడే మూడు గుణాలు ఆ పరమ పురుషుడినుంచే ఆవిర్భవిస్తున్నాయి. అవి ప్రపంచోత్పత్తికి, స్థితికి, లయానికి కూడా హేతువులవుతున్నాయి. అవి ద్రవ్యభూతాలైన పంచభూతాలను, జ్ఞానరూపాలైన దేవతలను,

క్రియారూపాలైన ఇంద్రియాలను ఆశ్రయిస్తున్నాయి. జీవుడు ఎప్పుడు కూడా బద్ధుడు కాడు. ముక్తుడే అయినప్పటికీ మాయతో కూడి ఉండడం వల్ల ఈ త్రిగుణాలతన్ని బంధిస్తున్నాయి. జీవుణ్ణి కప్పివేసే ఈ మూడు గుణాలను ఈశ్వరుడే కల్పించాడు. తద్ద్వారా ఆయన వినోదిస్తూ ఉంటాడు. తానుమాత్రం ఎవరికీ గోచరించడు. ఆ పరమేశ్వరుడు అనంతుడు. ఆయనే సమస్తానికి ప్రభువు. ఈశ్వరుడే మాయకు నియామకుడు. ఆ మాయవల్ల జీవాదృష్టము, కాలము, స్వభావము అప్రయత్నంగానే సిద్ధించాయి. వాటిని సృష్టి కార్య సహకారులుగా ఆయన స్వీకరించాడు.

మహత్తత్త్వం వల్ల కాలము నుంచి త్రిగుణాలు, స్వభావము నుంచి పరిణామము, అదృష్టరూపములో నున్న జీవుని కర్మ నుంచి జన్మము కలిగాయి. సత్త్వరజోగుణాలచేత వృద్ధిపొందిన మహత్తత్త్వం వికారానికి లోనైంది. దాన్నుంచి అహంకారం పుట్టింది. ఇది తమోగుణ ప్రధానమైంది. దీనికి రూపం పంచభూతాలు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు. ఈ అహంకారం కూడా వికారానికి గురై మూడు రూపాలుగా పరిణమించింది. అవి ద్రవ్యశక్తియైన తామసం, క్రియా శక్తియైన రజస్సు, జ్ఞానశక్తియైన సత్త్వం. పంచభూతాలకు మూలం తామసాహంకారం. దాని నుంచే ఆకాశం పుట్టింది. ఆకాశగుణం శబ్దం. ఇది ద్రష్ట అయిన ఆత్మకు, దృశ్యమైన జగత్తుకూ కూడా బోధకం. బహుసూక్ష్మం. ఆకాశం కూడా వికారానికి లోనైంది. దాని నుంచి వాయువు పుట్టింది. వాయుగుణం స్పర్శ. వాయువుకు తన గుణమైన స్పర్శ మాత్రమే కాక ఆకాశగుణమైన శబ్దం కూడా గుణమే. వాయువు ప్రాణరూపంలో శరీరాల్లో ఉంటుంది. ఇంద్రియ పటుత్వము, మనోబలము, శరీరశక్తి దానివల్లనే కలుగుతాయి. వాయువు వికారాన్ని పొందడంతో దాన్నుంచి తేజస్సు పుట్టింది. దీనికి శబ్దము, స్పర్శ, రూపము గుణాలు. తేజస్సు నుంచి నీరు పుట్టింది. దీనికి శబ్ద, స్పర్శ, రూప, రసాలు గుణాలు. నీటి

నుంచి భూమి పుట్టింది. దీనికి శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము అనబడే ఐదుగుణాలు. ఇవన్నీ తామసాహంకారం నుంచే జన్మించాయి.

సాత్త్వికాహంకారం కూడా వికారానికి గురైంది. దానినుంచి మనస్సు పుట్టింది. మనస్సుకు అధిదేవత చంద్రుడు. ఆ సాత్త్వికాహంకారం నుంచే దిక్కులూ, వాసుదేవుడు, సూర్యుడు, వరుణుడు, అశ్వినీదేవతలు, అగ్ని, ఇంద్రుడూ, ఉపేంద్రుడూ, మిత్రుడూ, ప్రజాపతి అనే పదిమంది దేవతలు పుట్టారు. రాజసాహంకారం తేజస్సుతో కూడి ఉంటుంది. దీనినుంచే జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, బుద్ధీ, ప్రాణమూ ఏర్పడ్డాయి. శ్రవణేంద్రియానికి దిక్కులు, త్వగింద్రియానికి వాయువు, నేత్రేంద్రియానికి సూర్యుడు, రసనేంద్రియానికి అశ్వినీ దేవతలు, వాగింద్రియానికి అగ్ని, హస్తేంద్రియానికి ఇంద్రుడు, పాదేంద్రియానికి ఉపేంద్రుడు, గుదేంద్రియానికి మిత్రుడు, ఉపస్థేంద్రియానికి ప్రజాపతి దేవతలు. అంతః కరణం రెండు విభాగాలుగా ఉంటుంది. ఒకభాగం బుద్ధిని, జ్ఞానాన్ని కలిగిస్తుంది. మరొకభాగం ప్రాణానికి క్రియకు ఆధారం. పంచభూతాలు, పంచతన్మాత్రలు, ఇంద్రియాలు, మనస్సు విడివిడిగా ఉన్నంతవరకు బ్రహ్మాండ శరీరాన్ని నిర్మించలేకపోయాయి. భగవంతుడి శక్తివల్ల ప్రేరణపొంది ఇవన్నీ ఒక్కటిగా చేరాయి. చేతనాచేతనాలను కల్పించాయి. ఈ విధంగానే బ్రహ్మాండాన్ని నిర్మించాయి. ఈ అండం కోటి సంవత్సరాల దాక నీటిలోనే ఉండిపోయింది. తరువాత ఈశ్వరుడే ప్రాణరహితమైన ఆ బ్రహ్మాండాన్ని ప్రాణ సహితం చేశాడు. కాలస్వభావాన్ని, కర్మ స్వభావాన్ని ప్రేరేపించే ఆ పరమేశ్వరుడే బ్రహ్మాండంలో జీవరూపంలో ప్రవేశించి పెద్దదయ్యేట్టు చేశాడు. చివరికి ఆ అండాన్ని భేదించుకొని బయటకు వచ్చాడు.

" ఆండాళ్ – అనన్యభక్తి – సంకీర్తనా ఫలం "

– డా ॥ కె.బి.రాజేంద్రప్రసాద్, ఎం.ఎ., పిహెచ్.డి.,

ప॥ చూడరమ్మ సతులాల సోబాన పాడరమ్మ
కూడున్నది పతి చూడికుడుతనాంచారి ॥

చ ॥ శ్రీ మహాలక్ష్మియట సింగారాలకేమరుదు
కాముని తల్లియట చక్కదనాలకేమరుదు
సోముని తో బుట్టువట సొంపుకళలకే మరుదు
కోమలాంగి ఈ చూడికుడుతనాంచారి । చూడరమ్మ....

కలశాబ్ది కూతురట గంభీరాల కేమరుదు
తలపలోక మాతయట దయమరి యేమరుదు
జలజ నివాసినియట చల్లదనమేమరుదు
కొలది మీర ఈ చూడికుడుత నాంచారి । చూడరమ్మ....

అమరవందిత యట అట్టి మహిమ యేమరుదు
అమృత చుట్టమట ఆనందాలకేమరుదు
తమితో శ్రీ వేంకటేశు తానె వచ్చి పెండ్లాడె
కొమెర వయస్సు ఈ చూడికుడుతనాంచారి। చూడరమ్మ...

పద కవితా పితామహుడు గోదాదేవి వైభవాన్ని పాడి పరవశించిన తీరు. ఆళ్వారులే పాశురాల రచనలో, పాశురాలగానంలో, భక్తి పారవశ్యపు నీతి రీతి అనుభూతులను అనుభవించి అనుభవించి తరించారు. భక్తి

అమృతఝురిలో తడిసి తన్మయులై అనన్యభక్తికి, ప్రపత్తికి నిలువెత్తు సాక్ష్యాలుగ నిలిచారు. ప్రసిద్ధులైన పన్నిద్దరాళ్వారులలో ఏకైక మహిళా ఆళ్వారు ఆండాళ్ తల్లి. ఆమె గోదాదేవి. "కోదై" అనగా మాలిక అని అర్థం. ఆ కోదై పదమే గోదాగా మారిందని చెప్తారు. ఆ గోదామాతకున్న "ఆండాళ్" అనే పదాన్ని అరవలు లక్ష్మీదేవిగా భావించడం విశేషం. ఆళ్వార్ అంటే భక్తి లోతులను ఎఱిగినవారని అర్థం. జ్ఞానం కల్గితే భక్తి వైరాగ్యాలు పట్టువడతాయి. భక్తిలో పరాభక్తి శ్రేష్ఠమైంది. అలాంటి భక్తి తత్పరతతో పాశురగానం చేసి, పరమాత్మను పరవశింప చేసి, ఆ పరమాత్మనే భర్తగ చేపట్టి, స్వామి పాదాలలో తాను కలసిపోయిన మహాతల్లి గోదాదేవి. శ్రీరంగణ్ణి భోగరంగనిగ తన భక్తియోగంతో చేసిన గడుసరి. అన్నమయ్య భక్తిరససృష్టిలో, భావనా ప్రపంచంలో ఆ తల్లి శ్రీలక్ష్మీమాత. సంగీత సాహిత్యాలు బిడ్డల బలానికి ఫలానికి ఆ జగన్మాత అనుగ్రహించిన అమృతస్తన్యాలు. సంగీతం – సాహిత్యం రెండూ సనాతన సహవాసులు. జీవాత్మలను తరింపచేసి, పరమాత్మతో ఏకం చేయగల దివ్యదీప్తులే. ఆది పరాశక్తి మహిమాభివ్యక్తులే.

గోదాదేవినే అన్నమయ్య "చూడికుడుతనాంచారి" అన్నారు. మన శ్రీకృష్ణదేవరాయలు ఆ తల్లినే "ఆముక్త మాల్యద" అన్నారు. పదాలు వేఱు. పరమార్థం ఒక్కటే. తాను ధరించి, విడిచిన మాలను తన భోగదైవమైన శ్రీరంగనకు అర్పించినది కాన ఆ తల్లిని సంస్కృతంలో ఆముక్తమాల్యద అన్నారు. అదే అరవంలో చూడికుడుత నాంచారి. తిరుమల వాసుడు అన్నమయ్యకు ప్రాణమే. అయినా అమ్మ దగ్గరకు వచ్చేసరికి అన్నమయ్య అమ్మపక్షం చేరిపోయాడు. "అయ్యతో కలసియున్న అమ్మను శుభప్రదంగా పాడండి. ఓ సతులారా! ఎందుకంటే అమ్మ

సామాన్య కాదు. అమ్మలకే అమ్మ. తాను ధరించిన మాలనే మన అయ్య (భగవానుడు) ఇష్టంతో ధరించాడు కదా! అమ్మ సిరులదేవేరి, కాముణ్ణి కన్నతల్లి, చందమామకు తోబుట్టువు, క్షీరసాగరుని కూతురు, జగన్మాత, పద్మనివాసిని,అమరవందిత, అమృతంతో బుట్టినది, సింగారాలకు, చక్కదనాలకు, ఇంపుసొంపులకు, గంభీరాలకు, దయాదాక్షిణ్యాలకు, చల్లని చూపులకు, మహిమలకు, ఆనందాలకు పుట్టినిల్లు లోకమాత చూడికుడుత నాంచారి. అందునా యౌవనాల సౌందర్యంతో అలరుతున్న, అమ్మ కోరిక కొద్దీ, కావాలని, అనన్యమైన భక్తి ప్రపత్తులతో తానె వచ్చి మరీ వేంకట విభుని పెండ్లాడింది" అన్నాడు. విల్లిపుత్తూర్‌లో విష్ణు చిత్తుని దగ్గర పెరిగి పెద్దదియైన తల్లి పూర్వజన్మ వాసనా బలంతో హరిని ఆరాధించి, అర్చనలు చేసి, ద్రవిడ పాశురాలను పాడి మెప్పించి, ఒప్పించి, చేపట్టింది. అమ్మ భక్తికి, అమ్మ సాహిత్య సృష్టికి, అచ్యుతుడు, సర్వేశ్వరుడు సంతృప్తితో సాయుజ్యమివ్వడం విశేషం. సంకీర్తనా బలం ఫలం అలాంటివి.

ఇప్పుడు ఆళ్వారులు ఎవ్వరు? ఆండాళ్ ఆళ్వార్ పూజలు, గోదారంగనాధుల కల్యాణాన్ని చూద్దాం.

భగవత్ తత్త్వాన్ని దర్శించి, అనుభవించిన మహాభక్తులు ఆళ్వారులు. కులాలకు, మతాలకు, ప్రదేశాలకును వీరు అతీతులు. వివిధ కాలాల్లో జన్మించి, వైష్ణవ భక్తిని సామాన్య ప్రజలకును అవగాహనకు వచ్చే రీతిలో పాశురగానం చేసి ముక్తులైనారు. సమత మమతల మానవతా గృహాలలో మాధవుని సామాన్య ద్రవిడ భాషలో పాడి మెప్పించారు. వారి కీర్తనలే పాశురాలు.

భక్తి ఆధ్యాత్మికతలు, ధార్మిక నైతికతలను ధరణిపై పునరుద్ధరించడానికి

శ్రీమహావిష్ణువు తన పరివారాన్ని, భూమాతను భూమికి పంపించాడట. వారే పన్నిద్దరాళ్వారులు. వీరిలో ఏకైక మహిళా ఆళ్వారు ఆండాళ్ తల్లి. విష్ణుదేవుని భక్తిని, మాయను, వైభవాన్ని వర్ణించి, అభినుతించి, పాడి అనుభవించి, ప్రజలకు ఆ వైష్ణవభావాభిరుచిని కల్గించడంలో కృతకృత్యులైనారు. వారే,

1). పొయిగై ఆళ్వారు: స్వామి పాంచజన్యపు అంశ. **(2).**పూదత్తాళ్వారు: స్వామి కౌమోదకీగద అంశ, **(3).** పేయాళ్వారు: నందకమనే ఖడ్గం అంశ. **(4).** తిరుమళిసై ఆళ్వారు: స్వామి సుదర్శన చక్రం అంశ. **(5).** కులశేఖర ఆళ్వార్: కౌస్తుభపు అంశ. **(6).** తండిరిప్పొడి ఆళ్వారు: వైజయంతీమాల అంశ. ఈయనే విప్రనారాయణ. **(7).**తిరుప్పాణ్ ఆళ్వారు: శ్రీవత్సలాంఛనం అంశ **(8).** తిరుమంగై ఆళ్వార్ : శార్ఙమనే ధనుస్సు అంశ **(9).**పెరియాళ్వార్ స్వామి వాహనం గరుత్మంతుడు. ఈయనే గోదాదేవి తండ్రి **(10).**ఆండాళ్ ఆళ్వారు భూదేవి అంశ. **(11).** నమ్మాళ్వార్ విష్వక్సేనుని అంశం. **(12).** మధురాళ్వార్ స్వామి రథపు అంశ.

ఈ ఆళ్వారులు పాడిన పాశురాల సంకలనమే " నాలాయిర దివ్య ప్రబంధం" ద్రవిడ వేదంగా వినుతికెక్కింది. 4000 దివ్యపాశురాలున్నాయి. వీనిలో 1100 పాశురాలు నమ్మాళ్వారు పాడినవే.

శ్లో ॥ అనన్య చేతాస్సతతం యో మాం స్మరతి నిత్యశః

తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః ॥ అని గీతా వచనం.

అర్జునా! ఎవరు అనన్య చిత్తంతో నిరంతరం నన్ను స్మరిస్తారో, ధ్యానిస్తారో వారికి నేను సులభుడను. అనగా తేలికగా అలాంటి అనన్య భక్తియుతుడు నన్ను పొందుతాడు. అనన్య భక్తి చేతనే జీవుడు నిజంగా

నన్ను తెల్సుకొంటాడు. నన్ను చూడగల్గుతాడు. నన్ను చేరగల్గు తాడనియును చెప్తాడు కృష్ణయ్య. అనన్య భక్తి అంటే మరొక ఆలోచనకు తావు లేకుండా పరమాత్మయందే లగ్నం కావడం. దృశ్య ప్రపంచంలో దేనిపైనా తన మనసు పోరాదు. ఆలోచనలు, అనురక్తి, ఆసక్తులన్నీ పరమాత్మే కావాలి. దుస్సంగతులు దూరమై, సత్సంగతులు దగ్గరై, సత్యశోధన తత్త్వసాధనలతోనే ఆ అక్షరపరబ్రహ్మ జీవునకు పట్టువడతాడు. "చక్రి సర్వోపగతుడు. ఎందెందు వెదకి చూచిన అందందే గలడు దానవాగ్రణి వింటే" ఇది ప్రహ్లాదుని హితవు. చూడగల్గిన కనులు, వినగల్గిన చెవులు, తెలియగల్గిన హృదయం కావాలి. నరనారాయణులు శ్రీకృష్ణార్జునులు సనాతనమునులే. అయినా అర్జునునకు "దివ్యందదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరమ్ " ఈశ్వర సంబంధమైన యోగమహిమను చూడ్డానికి దివ్యచక్షువులను స్వామి ప్రసాదించడం గీతలో చూచాం. అయితే ఆళ్వారులు అనన్య భక్తి జ్ఞాన పారవశ్యంతో ఆ యోగమహిమను చూడగల్గడం విశేషం. కారణం వారిలోని అనన్యభక్తి ప్రపత్తులే మూలం.

వ్రేపల్లె గోపికలను భాగవతం చూపింది. ఓ క్షణం కన్నయ్య కన్పించకపోతే వారు వనులు గిరులు, చెట్లు పుట్టలు, గుట్టలు వెదకారు, వేదన పడ్డారు. వెర్రెత్తిపోయారు. అంటే పిచ్చివారైనారు. 'మీ పొదల మాటున కన్నయ్య దాగినాడేమో చెప్పండమ్మా " అంటూ అడిగారు. అరిచారు. ఆరడి చేశారు. మరి వీరికి సంసారాలున్నాయి. సంగతు లున్నాయి. భర్తలు, బిడ్డలు, బంధువులు ఉన్నారు. కాని పరమాత్మపై అవిచ్ఛిన్నమైన ప్రేమ, జీవాత్మ పరమాత్మకై తపన, తాపత్రయం. ఇది అనన్యభక్తి. ఆ భక్తికే భగవానుడు వశుడైనాడు. ఆళ్వారులు అలాంటివారు. నమ్మాళ్వారు తనను గోపికగ భావించుకొని గోపాలుడైన స్వామికై పాడాడు. పాటల పారవశ్యంలో పరమాత్మ తత్త్వదర్శనానందాన్ని పొందాడు. ఆత్మ పరమాత్మల సాంగత్యం, సహవాసం సహానుభూతి సనాతనమైంది.

ఆండాళ్ ఆళ్వారు అలాంటిదే. ఈ తల్లి "తిరుప్పావై" వ్రతానికే శ్రీకారం చుట్టింది. తిరుప్పావై వ్రతాన్ని విద్వాన్ బొమ్మకంటివారు "సిరినోము" అని ముచ్చటగా సెలవిచ్చారు. చెలులతో 30 రోజులు గోదాదేవి శ్రీరంగనాథునికై వ్రతమాచరించింది. రోజునకు ఒక పాశురం పాడింది. గోదామాత యితరులతో మాట్లాడిన వైనం మనం చూడం. ఎంతసేపు మౌనంగా,మాధవ ధ్యానమే. మార్గశీర్ష మాసం మాధవుని మహిమాసమంచితమైన పావనకాలంలో తిరుప్పావై ఆరంభమైంది. అదే ధనుర్మాసం అని ధనుస్సంక్రమణాన్ని బట్టి మనం పిలుస్తున్నాం. బ్రాహ్మీ ముహూర్తంలో లేవడం, చెలులతో స్నానమాచరించడం, శుభ్రవసనాలను ధరించడం, వెండ్రుకలను సవరించుకొని, బొట్టు పెట్టుకొని, చెంగల్వ పూదండలతో దేవాలయానికి వెళ్ళడం, స్వామికి పూదండలర్పించడం, పూజించడం, ధూపదీప నైవేద్యాలర్పించడం, స్థిరభక్తితో తాంబూలాలను అర్పించడం, శఠగోపం ధరించడం, పాదతీర్థం స్వీకరించడం, తత్ప్రసాదలబ్ధ మాలలను ధరించడం, ఆ యదుపతియైన శ్రీరంగని గుణములను ద్రవిడ భాషలో పాడడం అమ్మ దినచర్య. తండ్రి విష్ణుచిత్తునకును గోదాదేవి వ్రతం అయోమయ మన్పించింది. అదే స్వామికి మెఱపెట్టుకుంటాడు. "భాగవతుల భక్తి వారి కీర్తనలలో దాగియుంటుంది. భాగవతుల కీర్తనా ఫలం అమోఘం" అంటూ స్వామి మాలదాసరి కథ చెప్తాడు.

27వ రోజున గోదామాత "కుడారై" అనే ఉత్సవం నిర్వహిస్తుంది. పాయసం భక్తి మాధుర్య సమంచితంగా చేసి, నిండుగా నేయిని పోసి, స్వామితో "స్వామీ! కలసి అందరం ఆరగిద్దాం" అంటూ గానం చేస్తుంది. అదే మోక్షభావనామాధుర్యం. ఆత్మ పరమాత్మల సాంగత్యానుబంధ మకరందం. అమృతత్త్వం. అమరత్వం. చివరకు ముప్పయి పాశురాల

గానంతో అమ్మ శ్రీరంగనిలో లీనమవుతుంది. ఆముక్తమాల్యద కథలో మాత్రం శ్రీరంగనాథుడు విష్ణుచిత్తుని ఒప్పించి, గోదామాతను వైష్ణవ సంప్రదాయానుగుణంగా వివాహ మాడుతాడు. అనంతరం అమ్మ పాశురగానం కావిస్తూ అందరూ చూస్తుండగనే స్వామిలో లీనమవుతుంది.

ఇక్కడొక చిన్న ఐతిహ్యం. గరుత్మంతుడు స్వామికి ఒకమారు ..“స్వామీ! నేను మామగా నీ పాదపద్మాలను కడిగి నా బిడ్డను ఇచ్చి వివాహం చేసి, అల్లునిగా అదృష్టభాగ్యానికి నోచుకోవాలన్నా”డట. అందుకు స్వామి “తథాస్తు” అన్నాడు. ఫలితంగా గరుత్మంతుడు విష్ణుచిత్తుడైతే, భూమాత గోదామాతగా అయోనిజగా విష్ణుచిత్తునకు తులసీవనంలో దొరికిందట. అందుకు ప్రతిఫలమే గోదారంగనాథు ప్రణయం. కల్యాణం. మొత్తానికి భోగి పండుగ స్వామిని భోగరాయుని చేసిన గోదమ్మ భక్తి వైభవానికి ప్రతీకగా చెప్పుకొనవచ్చు.

మనం కలి పురుషుని కాలంలో కలసి నడుస్తున్నాం. మంచికి వాడు వంచన చేస్తాడు. వివేచనతో ఎంచుకొని వాని ప్రభావాన్ని మనం త్రుంచగల్గాలి. అందుకే సదా “ఓం నమో భగవతే వాసుదేవాయ” అనే ద్వాదశాక్షర మంత్ర పఠనంతో మార్గశీర్ష మాసపు కాలాన్ని కరగిద్దాం. భక్తి భజనలతో, కీర్తనలతో సహవాసం చేద్దాం.

9వ భాగవత సదస్సు

శ్రీకాళహస్తి శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరుగుచున్న భాగవత సదస్సులలో **9వ భాగవత సదస్సు 13-02-2019వ తేది నుండి 19-02-2019** తేది వరకు జరుగనున్నది. ఈ సదస్సులో **పూజ్యశ్రీ శ్రీమాతాజ్యోతిర్మయానంద భారతిస్వామిని వారు నవమ స్కంధంపై ప్రవచన చేస్తారు. అందరికీ ఆహ్వానము. రండి. వినండి !**

ఆధ్యాత్మిక సాధకులకు సదవకాశము

“దివ్యజీవన సంఘము”నకు చెందిన “యోగవేదాంత ఫారెస్టు అకాడమీ” 91వ యోగ వేదాంత తరగతులను 1-3-2019వ తేదీ నుండి 29-04-2019వ తేదీ వరకు రెండు మాసములు నిర్వహించనున్నది. ఈ తరగతులు ఋషీకేశ్, శ్రీ శివానందాశ్రమ ప్రాంగణమునందు జరుగును. 20 నుండి 65 సంవత్సరముల మధ్య వయస్సు గల భారతీయ పురుషులకు ఈ తరగతులు స్థానికముగా నిర్వహింపబడును. ఈ తరగతులు ఆంగ్ల భాష యందొసంగబడుటచే విద్యార్థులు పట్టభద్రులై ఆంగ్ల భాషలో అనర్గళముగా మాట్లాడుట, చదువుట, వ్రాయుట తెలిసియుండవలయును. శిక్షణ, వసతి, భోజనము ఉచితము. దరఖాస్తు ఫారములు ఇక్కడికి చేరవలసిన చివరి తేదీ: 15-01-2019. ఈ క్రింది అడ్రసు నుండి దరఖాస్తు ఫారము, శిక్షణ ప్రణాళికలను పొందవచ్చును. మరియు www.sivananda online.org website నుండి కూడా పొందవచ్చును.
e - mail: yufa@dlshq.orrg.

Address :
The Registrar,
The Yoga Vedanta Forest Academy,
Sivanandanagar - 249192,
Tehri Garhwal District,
(Uttrakhand)

ఇట్లు
స్వామి యోగ వేదాంతానంద
రిజిస్ట్రార్
యోగ వేదాంత ఫారెస్టు అకాడమీ

గురుదేవుల ఆరాధనోత్సవాలు

గురుదేవులు **పూజ్య శ్రీశ్రీశ్రీ** విద్యాప్రకాశానందగిరి స్వాములవారి **ఇరవై ఒకటవ ఆరాధనోత్సవాలు 2019** సంవత్సరం ఏప్రిల్ నెల **18వ** తేది నుండి **22 తేది వరకు 5 రోజులు** జరుగును.



నమస్కారం

– కె. ఈశ్వర్

సత్పురుషులకు శతకోటి నమస్కారాలు. నమస్కారం సంస్కారానికి చిహ్నం. సంస్కారమే లేని వ్యక్తి నమస్కారం చేయలేడు. నమస్కారం నాలుగు అక్షరాలే. అయినా అందులోనే వుంది పరమార్థం.

నమస్కారం అయస్కాంతం వంటిది. అది శత్రువును మిత్రునిగా మార్చగలదు. ఆవేశాన్ని అణచగలదు. ఎంతటి కోపాగ్నినైనా చల్లార్చగలదు. ఎదుటి వ్యక్తిపై కోపముతో ఊగిపోతూ బి.పి.ని పెంచుకొని చిందులు వేసే వ్యక్తిని సహితము ఒక్క నమస్కార బాణంతో శాంతింపజేయవచ్చును.

అర్జునుడంతటి పరాక్రమశాలి యుద్ధక్షేత్రములో గురువైన ద్రోణాచార్యునితో, పితామహుడైన భీష్మునితోను యుద్ధం చేయవలసి రాగా వారిని దర్శించిన మరుక్షణమే అంబులపొదలో నుండి తన బాణాలను తీసి వారి పాదాల వద్దకు పంపెను. దీనినే నమస్కార బాణం అంటారు. ఇది చక్కటి సదాచారము. సత్సంప్రదాయము. ఇదే విషయాన్ని ద్రోణాచార్యుడు భీష్మునితో అర్జునుడు ఎంతటి గురుభక్తి పరాయణుడో గమనింపుమనెను. ఇంతటి విజ్ఞాన శీలునితో యుద్ధము చేయుటకు మనస్సంగీకరించుట లేదనెను.

దీనినిబట్టి ఎదుటి వ్యక్తి క్రోధాగ్నిని చల్లార్చుటకు కష్టము లేని, నష్టము లేని, పెట్టుబడి లేని ఆయుధమే నమస్కారం అని అందరూ అంగీకరించగలరు.

కొందరిలో 'అహం' అడ్డుపడి నమస్కారం చేయలేరు. అహం పురోగమనానికి అడ్డుగోడ వంటిది. ఎంతో విలువైన నమస్కారంతో ఎదుటి వ్యక్తి ప్రతి నమస్కారంతో స్పందించనిచో అది అతని విజ్ఞతకే వదలాలి.

సభ్యత, సంస్కారం గల వ్యక్తి నమస్కారానికి తప్పక స్పందించ గలడు. అలా స్పందించని వ్యక్తి హృదయము కఠోరమైనదిగను, అహంకారానికి చిహ్నముగను భావించాలి. దుర్మార్గునికి కూడ ఒక నమస్కారం పెట్టి కంపును వదలించుకొనుట శ్రేయస్కరము.

తమ తమ పనులు నెరవేర్చుకొనుటకు, తమ స్వార్థం కొరకు కొందరు దొంగదండాలు పెట్టేవారు, వంగి వంగి నమస్కారం చేసేవారు వున్నారు. ఇట్టివారు తమ పని పూర్తికాగానే పక్క కెళ్లి విమర్శనాస్త్రాలు సంధించేవారు కూడా లేకపోలేదు.

ఏది ఎట్లున్నను నమస్కారం అనే పదానికి అనాది నుండి, ఆనాటి నుండి ఈనాటి వరకు ఏనాటికైనను చాలా ప్రాముఖ్యత వున్నది. ఎదుటి వ్యక్తి మనస్సును మైమరపించే నమస్కారానికి వున్న ప్రాముఖ్యతను, ఆ పదానికున్న అర్థాన్ని, అంతరార్థాన్ని, పరమార్థాన్ని వ్యర్థము చేయరాదు.

నమస్కారం గౌరవ మర్యాదలకు, భక్తి భావనకు, ప్రేమతత్త్వానికి చిహ్నం. నమస్కారం మనస్సును మురిపిస్తుంది. ఆనందింపజేస్తుంది. ఇట్టి నమస్కారం పెద్దల ఆశీస్సులు, దైవానుగ్రహం పొందుటకు చక్కటి సులభమార్గము. ఈ మార్గాన్నే పయనించాలి కాని కుతంత్రాలతో, కుత్సితాలతో, క్రుళ్ళుతో క్రుళ్ళిపోరాదు.

ఇట్టి అమూల్యమైన నమస్కారాన్ని ఈ పర్వదినాన దైవానికి మరియు దైవముతో సమానమైన మాతా పితరులకు, నన్ను దరిచేర్చి అనుగ్రహించి ఆశీర్వదించిన సద్గురు దేవులు, మద్గురు దేవులు పూజ్యపాదులు శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారికి సమర్పించిడమైనది.

శుభం భూయాత్, జై శ్రీరామ – వాసుదేవ,

శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందులకు జై.

ఉపదేశసారము

– భగవాన్ శ్రీరమణ మహర్షి

1. **కర్తురాజ్ఞయా ప్రాప్యతే ఫలమ్ ।**
కర్మ కిం పరం కర్మ తజ్జడమ్ ॥

తా ॥ విశ్వానికి కర్తయైన ఈశ్వరుని ఆజ్ఞానుసారము ప్రాణియొక్క కర్మఫలితము ఆ ప్రాణిచేత పొందబడును. యథార్థంగా కర్మ అన్నిటికంటే శ్రేష్ఠమైనదా? కానేకాదు. ఆ కర్మ జడము.

2. **కృతిమహోదధౌ పతనకారణమ్ ।**
ఫలమశాశ్వతం గతినిరోధకమ్ ॥

తా ॥ కర్మ ఫలితము అశాశ్వతమైనది. నశించునది. నిశ్చయంగా అది సంసారమునందు సంసార సాగరమునందు పతనమవడానికి కారణం అవుతూంది. కనుక కర్మ అనేది ముక్తి నిరోధకము ముక్తిని నిరోధించేది.

3. **ఈశ్వరార్పితం నేచ్ఛయా కృతమ్ ।**
చిత్తశోధకం ముక్తి సాధకమ్ ॥

తా ॥ ఫలితంపై ఇచ్ఛ లేకుండా, సంగత్వం లేకుండా (కర్మఫలితంపై ఇచ్ఛ లేకుండా) ఆచరించబడు కర్మ, ఈశ్వరార్పణ చేయబడి, అంతఃకరణ శుద్ధిని కలిగించి ముక్తిసాధకము యగును.

4. **కాయవాఙ్మనః కార్యముత్తమమ్ ।**
పూజనం జపశ్చింతనం క్రమాత్ ॥

తా ॥ దేహము, వాక్కు, మనస్సు అనబడువానిచేత ఆచరించబడు కార్యములు పూజ, జపము, ధ్యానము అనబడు కర్మలు క్రమంగా ఉత్తమాలు – శ్రేష్ఠతరాలు.

5. **జగత ఈశధీయుక్త సేవనమ్ ।**
అష్టమూర్తిభృద్దేవ పూజనమ్ ॥

తా ॥ జగత్తంతా ఈశ్వరుడు అను భావంతో చేయబడు సేవ ఎనిమిది రూపములను ధరించియున్న ఈశ్వరునికి చేయబడు పూజయగును.

వార్తలు

(01). పూజ్య శ్రీ విద్యాప్రకాశానంద స్వాములవారి స్మారక భాగవత సదస్సులలో 5వ సదస్సు 26-11-2018 నుండి 2-12-2018 వఱకు జరిగినది. శ్రీశుకబ్రహ్మాశ్రమ పీఠ ఉత్తర పీఠాధిపతులు పూజ్యశ్రీ సంపూర్ణానందగిరిస్వాములవారు పంచమ స్కంధంలోని ఋషభ, భరతోపాఖ్యానాలలోని బోధలను వివరంగా వివరించారు. శ్రోతలు చాలా ఆనందించారు. సదస్సు చివరిరోజు డిశంబరు 2వ తేది సత్సంగ నిర్వహణ సమితి వారు మఱియు శ్రోతలు పూజ్యశ్రీ స్వాములవారికి సత్కారం చేశారు.

(02). 16-12-2018 తేది నుండి ప్రారంభమైన 6వ భాగవత సదస్సు 22-12-2018 తేది సాయంకాల ప్రవచనతో సమాప్తమైంది. పూజ్యశ్రీ మాతా పరావిద్యానందగిరి స్వామినివారు భాగవతం ఆరవ స్కంధంలోని అజామిళోపాఖ్యానం, వృత్రాసుర, చిత్రకేతుల విషయాలను, తాత్త్వికంగా వివరించారు. శ్రోతలు స్వామినివారిని సత్కరించి తమ హర్షాన్ని ప్రకటించారు. శ్రీశుకబ్రహ్మాశ్రమం వారున్ను పూజ్య స్వామినివారిని సన్మానించారు.

(03). 13-12-2018తేది సుబ్రహ్మణ్యషష్ఠి సందర్భంగా ఆశ్రమ శివాలయంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామిమూర్తికి వేశేషాభిషేకం అర్చన శ్రీ పరమేశ్వరానందగిరిస్వామి నిథితో చేయబడినది.

(04).18-12-2018 తేది గీతాజయన్తి కార్యక్రమం శ్రీశుకబ్రహ్మాశ్రమంలో జరిగినది. శ్రీమద్భగవద్గీతకు పూజ, భగవద్గీత 18 అధ్యాయాల పారాయణ, శ్రీ విజయానందం బ్రహ్మచారిగారి నేతృత్వంలో జరిగినది. సాయంకాల గీతాతత్త్వంపై ప్రసంగాలు జరిగినవి.

(05). గీతాజయన్తి మఱియు తిరుపతి శ్రీమలయాళ సద్గురు సేవా సమాజ 48వ వార్షికోత్సవము 16-12-2018 తేది నుండి 18-12-2018 వఱకు తిరుపతి శ్రీపురం కాలనీని సమాజ భవనంలో విశేషంగా జరిగినది. ఈ కార్యక్రమంలో శ్రీశుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతులు పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు, మఱియు పూజ్యశ్రీ సర్వాత్మా నందస్వాములవారు (శ్రీశుకబ్రహ్మాశ్రమం) పాల్గొని ఉపన్యసించారు.

(06).డిశంబరు 28వ తేది దివ్య జనని పూజ్యశ్రీ శారదాదేవి జన్మదినోత్సవం శ్రీశుకబ్రహ్మాశ్రమంలో జరిగినది. మాతృమూర్తికి అర్చనాదులు జరిపి ప్రసాదవినియోగం చేయబడింది.

(7). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో నవంబరు నెలలో ఓ.పి విభాగంలో **501** మందికి కంటి పరీక్షలు చేసి తగు చికిత్సలు చేయబడినవి. **63** మందికి కంటి పొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చబడినవి. **8** మందికి యాగ్ లేజర్ చికిత్స చేయబడినది.